# ఉపాధ్యాయులు-విద్య-పౌరహక్కులు

-బాలగోపాల్

***(11.7.97 దీ మధ్యాహ్నం రాష్ట్ర కార్యదర్శి శ్రీ సి. హెచ్.ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన విద్యా సెమినార్‌లో పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ బాలగోపాల్ ఉపాధ్యాయులు -విద్య-పౌరహక్కులు అనే అంశంపై చేసిన ప్రసంగపాఠం. -సం॥)***

మీరు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ "పౌరహక్కులు-ప్రజాస్వామ్య హక్కులు అనే అంశం మీ ఆందోళనలో భాగంగా ఉండాలని భావిస్తున్నారు. ఆ రంగంలో పనిచేసే వాళ్ళను మీ సభలకు పిలిచి మాట్లాడమని అడుగుతున్నారు. కాని మన ప్రభుత్వం మాత్రం పౌరహక్కుల ఉద్యమంలో పనిచేసే వాళ్ళు విద్యారంగానికి ఎంతదూరముంటే అంత బాగుంటుంది అనుకుంటుంది. చిన్నస్కూళ్ళలోనే కాదు యూనివర్శిటీల్లో పనిచేసే అధ్యాపకులకు కూడా యీ ఆంక్షలు తప్పలేదు. ఉదాహరణకు నాగార్జున యూనివర్శిటీ అధ్యాపకులు అబ్దుల్‌నూర్ భాషా గారికి, యస్.కె.యూనివర్శిటీ ప్రొఫెసర్ శేషయ్యగారికి పౌరహక్కుల ఉద్యమంలో పని చేస్తున్నందుకు నోటీసులు యిచ్చారు. నిజానికి యీ నోటీసులు యిమ్మని కోరినప్పుడు యూనివర్శిటీ అధికారులు తమ స్వయంప్రతిపత్తిని గుర్తుచేసి ఇలాంటి నోటీసులు యివ్వడానికి నిరాకరించవచ్చు. మీ యూనివర్శిటీల్లో ఫలానా వ్యక్తులు పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్నారు. చెయ్యడానికి వీల్లేదు అంటూ ఎవరో హోం డిపార్టుమెంటులో జాయింటు సెక్రటరీ ఒకాయన యూనివర్శిటీకి ఒక సర్క్యులర్



ప్రసంగిస్తున్న శ్రీ బాలగోపాల్

పంపించారు. స్వయంప్రతిపత్తిగల యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌కు అధ్యాపకుల హక్కుల గురించి కనీసం తన హక్కుల గురించిన స్పృహ ఉన్నా దీన్ని ప్రశ్నించి ఉండాల్సింది. కాని అలా కాకుండా నోటీసులు జారీ చేశారు.

విద్యా వ్యవస్థ-పౌరహక్కులు అన్నప్పుడు విద్యారంగంలో పనిచేసేవాళ్ళకు సమాజంలోని మంచిచెడుల గురించి ఆలోచించి ఆందోళన చేసే హక్కు ఉందా? లేదా? అన్నది ఒక అంశం. మనం బోధించే విద్యలో ఏ రకమయిన ప్రజాస్వామిక విలువలున్నాయి? మన పాఠ్యపుస్తకాలలో బోధించే విషయాలుగాని ఏ రకమయిన ప్రజాస్వామిక విలువల కలిగిఉన్నాయి అనేది మరొక అంశం.

చదువు చెప్పడం, బోధించడం అనేది ఒక నిరంతర వ్యాఖ్యానం. కేవలం సమాచారం అందించే టీచరు ఎవరూ ఉండరు. తన చుట్టూ ఉన్న భౌతిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను గూర్చి సాధారణ జ్ఞానం గల ఏ ఉపాధ్యాయుడయినా తప్పనిసరిగా వ్యాఖ్యానించవలసి ఉంటుంది. అలా వ్యాఖ్యానం చేసే ఉపాధ్యాయుడు ఏ మేరకు ప్రజాస్వామ్య దృక్పథంతో చేస్తున్నాడు అనేది ఇంకొక అంశం. ఉపాధ్యాయుల చేతిలో పిల్లల హక్కులు ఏమౌతున్నాయి అనేది నాలుగో అంశం.

విద్యాబోధన అనేది ఒక నిరంతర వ్యాఖ్యానం కాబట్టి పై నాలుగు అంశాల్లో ఒక అంశాన్ని

(మిగతా 35వ పేజీలో)

---

(45వ పేజీ తరువాయి)

ప్రజాతంత్ర వ్యవస్థ విద్యావిధానంపైన ఏపిటియఫ్ ఒక పత్రాన్ని తయారు చేసింది. మనకు ఏం కావాలో దానిపైన మనకు స్పష్టత ఉంది. ఇదీ మా ప్రత్యామ్నాయ విద్యావిధానం అని మనం చెప్పాలి. దీని కొరకు ఒక ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఏపిటియఫ్ ముందు యివాళ ఉంది. 50 సంవత్సరాల ఫెడరేషన్ స్వర్ణోత్సవాల సమయంలో మనం తీసుకోవలసినటువంటి ముఖ్య నిర్ణయమిది.

నిజం చెప్పాలంటే ఉపాధ్యాయ సంఘాలున్నంతబలంగా, యూనివర్శిటీ, కాలేజి లెక్చరర్ల సంఘాలు లేవు. నేను కూడ కాలేజి అధ్యాపకుల సంఘంలో పనిచేసాను. మాణిక్యాలరావుగారు దాదాపు 20 సంవత్సరాలుగా ఏ.పి.కాలేజి టీచర్స్ ఫెడరేషన్ సెక్రటరీగా పనిచేసారు. మాధవరావుగారు ఎం.ఎల్.సి. గా పనిచేసారు. కాని యివాళ వాస్తవ మేమిటంటే కళాశాల, యూనివర్శిటీ అధ్యాపకుల సంఘాలకు విద్యారంగంలో నిర్ణాయకమైనటువంటి పాత్రను పోషించగల్గినశక్తి. సామర్థ్యం వాటికి లేవు. ప్రత్యామ్నాయ విద్యావిధానం ఒక ఎజెండాలో భాగంగా తీసుకుని, దానిని బలంగా ముందుకు తీసుకుని వచ్చేటువంటి శక్తి ఏపిటియఫ్‌కు మాత్రమే ఉంది. ఇది మీరు గుర్తించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే అనేక చారిత్రక పోరాటాలు నడిపిన సంస్థ యిది. నానాటికి పెరుగుతున్న సంస్థ యిది. వేలాదిమంది ఉపాధ్యాయులను ఒకచోటకు జేర్చి మహాసభలు జరపడం ఆ సంస్థ యొక్క పుష్టికి, జీవధాతువుకి నిదర్శనం. ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని, ప్రజాతంత్ర వ్యవస్థకు అనుగుణమైన విద్యావిధానాన్ని సాధించటానికి దీక్ష బూనవలసిందిగా కోరుతున్నాను.

ఈనాటి మన విద్యావిధానంలో సామాజిక విలువలు లేవు. చరిత్ర బోధించే ఉపాధ్యాయునకు చరిత్ర అంటే ఏమిటో తెలియదు. సరైన శాస్త్రీయ దృక్పథం లేదు. ఎందుకు లేదంటే ఆ ఉపాధ్యాయుడు చదువుకున్నటువంటి చదువులో ఆ విషయాలు లేవు. ఇంజనీర్‌కు, డాక్టర్‌కు సామాజిక బాధ్యతలేదు. ఎందుకు లేదంటే అతను చదువుకున్న చదువు అలాంటి బాధ్యతలను అతనిలో కలిగించడం లేదు. పూర్వపు జిడిఆర్‌గా ఉన్న తూర్పు జర్మనీలో ఈనాడు చాలా మంది ఆవేదన చెందుతున్నారు. ఈనాటి పాలనలో వైద్య, విద్యారంగాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడుతున్నాయని, మార్కెట్ వస్తువులుగా మారాయని అభిప్రాయపడుతున్నారు.

నేటి విద్యావిధానం విద్యావంతుల్లో సామాజిక విలువలను పెంపొందించడంలేదు. మిగతా రంగాలన్నింటిని వదిలివేసి విద్యారంగాన్నే పరిశీలిస్తే అవినీతి, స్కాంలు, పేపర్ లీకేజీలు కన్పిస్తాయి. అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వాలు సక్రమంగా పరీక్షలు నిర్వహించగలవా? ఇది సందేహాస్పదమే. ప్రభుత్వం చేస్తున్న పని పరీక్షలు నిర్వహించడమే. యూనివర్శిటీలు గానీ, విద్యాబోర్డులుకానీ చేస్తున్నది ఒక్కటే ఒక్కటి-పరీక్షలు నిర్వహించడం.అదికూడ నిర్వహించలేని స్థితికి దిగజారిపోయింది. పేపర్లు లీక్ కాకుండా పరీక్షలు నిర్వహించగలవా? చేయలేవు. చదువు చెప్పడంలేదు. విద్యారంగం అభివృద్ధి చెందడం లేదు. ఉద్యోగాలు కావల్సిన చదువు యివ్వడంలేదు. ప్రభుత్వం సరియైన చదువు చెప్పలేక పోతున్నది. పరీక్షలు సక్రమంగా నిర్వహించలేక పోతున్నది. ప్రజల నుండి దూరమైపోయింది. వ్యవస్థ దిగజారిపోయింది. బలహీనమై కుళ్ళిపోయి ఉంది. అందువల్లనే ఇవాళ ఈ వ్యవస్థను, విద్యావ్యవస్థను మార్చడం సులభం. బలహీనమై, శిధిలమైన వ్యవస్థను నాలుగు దెబ్బలు కొడితే పడిపోతుంది. ఈ రోజు ఆ శక్తి మనకు కావాలి. కాబట్టి ప్రజాతంత్ర వ్యవస్థకు కావలసిన విద్యా విధానాన్ని రూపొందించుకోవడంలో మనం కృషి చేయాలని, అది మన ప్రధానమైన నినాదంగా, మన కార్యక్రమంలో భాగంగా ఒక ముఖ్యమైన డిమాండ్ గావాలి. ఆ కృషి ఈనాటి నుండే ప్రారంభం కావాలని, వచ్చే దశాబ్దంలో, నూతన శతాబ్దంలో కూడ లక్ష్యసాధనకు కృషి కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను.

*

ప్రాతిపదికగా తీసుకుని మాట్లాడతాను. ఉపాధ్యాయుడు తాను బోధించే సబ్జక్టులోని సిలబస్‌ను మాత్రమే కాకుండా దానితోపాటు తెలిసో తెలియకో, ఉద్దేశపూర్వకంగానో, ఏ ఉద్దేశం లేకుండానో ఒక ప్రాపంచిక దృక్పథాన్ని పిల్లలకు అందిస్తూ ఉంటాడు. ఉద్దేశపూర్వకంగా అందిం చేవారు దానిలో మంచి చెడ్డలతో సంబంధం లేకుండా సమగ్రంగా ఆ పనిని చేస్తారు. ఉద్దేశపూర్వకంగా చేయనివాళ్ళైనా తమలో ఉన్నాయని, తమకే తెలియని భావాలను, బయట నుంచి గ్రహించిన వాటిని పిల్లలకు తమకు తెలియకుండానే అందిస్తారు. అలాకాకుండా ఈనాటి బాహ్య పరిస్థితులను గురించి, ఆ పరిస్థితులలో ప్రజాస్వామ్యం, పౌరహక్కులకు ఎదురవుతున్న విపత్తులను గురించిన అవగాహన మనం పెంచ కుంటే చెప్పేసబ్జక్టునిబట్టి, పాఠాన్నిబట్టి కొంతవరకైనా భారతదేశంలో పరిమితంగానైనా కొనసాగుతున్న యిప్పటి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే చైతన్యాన్ని పిల్లలకు ఇవ్వగలుగుతామేమో.

ఈ అంశం గురించే యిప్పుడు నేను మాట్లాడతాను. భారతదేశంలో ఈ మధ్యకాలంలో ప్రజాస్వామ్య విలువలు తగ్గిపోతున్న విషయం చాలా వరకు మనందరకూ తెలుసు. ప్రజాస్వామ్య మనగానే పౌరహక్కులు, పత్రిక స్వేచ్ఛ, న్యాయవ్యవస్థకు కొంత స్వతంత్ర ప్రతిపత్తి ఉండడం, ఎన్నికలు క్రమంగా జరపడం, ప్రజలకు కొంతవరకైనా పరిపాలకులు ఎవరూ అని నిర్ణయించే అవకాశం ఉండడం ఇవన్నీ ఇందులో భాగాలు అవుతాయి. వీటన్నిటిపైనా దెబ్బపడే ప్రమాదం రాబోయే రోజుల్లో ఉంది. ఈ ప్రమాదం ఏ విధంగా వస్తుంది అనేది మనం తెలుసుకుంటే కొంతవరకైనా పిల్లల్ని హెచ్చరించే అవకాశం ఉంటుంది.

ఇటీవలి కాలంలో ఒక విశాలమయిన ప్రజానీకం మొట్టమొదటిసారిగా విద్యారంగంలోనికి ప్రవేశిస్తున్నారు. బ్రాహ్మణులు మాత్రమే చదువుకోవాలి అనే సంస్కృతి ఉన్న యీ దేశంలో కాలక్రమంలో అది పరిణామం చెందుతూ ఈ తరానికి మొట్టమొదటిసారిగా అనేక వర్గాల నుంచి, కులాల నుంచి, సామాజిక శ్రేణుల నుంచి చాలా మంది పిల్లలు స్కూలుకు వస్తున్నారు. ఇందులో ఆంక్షల ప్రసక్తిలేదు.

ఉపాధ్యాయుడంటే బ్రాహ్మణ కులస్థులే తప్ప యితరులు ఉండని దశ నుండి ఎవరినైతే చాకిరీ చెయ్యడమే మీ ధర్మమని బ్రాహ్మణ ధర్మశాస్త్రాలు నిర్దేశించాయో ఆ కులాల వాళ్ళు కూడా చదువుకొని ఉపాధ్యాయులవుతున్నారు. మన సమాజంలో ఇది గొప్ప మార్పు. ఈ క్రమంలో ముందుకొస్తున్న క్రొత్త విద్యార్థుల జీవితానుభవాలు, వాటిలో ఉన్న ప్రజాతంత్ర ఆకాంక్షలు, కోరికలకు ఉపాధ్యాయులు కూడా స్పందించి అలాంటి జీవితాలనుంచి వచ్చినవారయితే తమ అనుభవాన్ని కూడా జోడించి, చుట్టూ ఉన్న సమాజాన్ని తదనుగుణంగా వ్యాఖ్యానించి, వాళ్ళలో విజ్ఞానం పెంపొందించి, వాళ్ళ ఆరాటానికి ఒక రూపం యివ్వడం చాలా ముఖ్యమయిన కర్తవ్యం. ఆ రకంగా వస్తున్న క్రొత్తశక్తులకు చైతన్యాన్ని అందివ్వడం, విజ్ఞానాన్ని అందివ్వడం, వాళ్ళచైతన్యా నికి అడ్డుకట్టవేసే రూపంలో గాకుండా వాళ్ళ కోరికలకు ఒక స్థానాన్ని కల్పించడం సమాజం బాధ్యత. ఆ రకమయిన చైతన్యాన్ని సమాజానికి కూడా యివ్వాలి. ఇందులో ముఖ్యపాత్ర ఉపాధ్యాయునిది.

మొత్తంగా రాజకీయ ఆర్థిక జీవితంలో ప్రజాతంత్ర అవకాశాలపైన దాడి చాలా ప్రమాదకరమయింది. కొత్తగా ముందుకు వస్తున్న కోరికలు, ఆరాటాలపైన కూడా యీ దాడి ప్రభావం ఉంటుంది. దీనిని గురించి క్లుప్తంగా వివరిస్తాను. హిందూ దినపత్రికలో చిన్నవార్త వచ్చింది. పాకిస్తాన్‌లోని ఇంగ్లీషు పేపరు "డాన్" ఒక సంపాదకీయంలో జనతాదళ్ పార్టీలోని అంతర్గత సంక్షోభంపై "ఎంత కొట్టుకున్నా, ఎంత చీలికలు పేలికలు అయినా భారతీయ రాజకీయాలకు ఒక సుగుణం ఉంది. ఈ పార్టీల వాళ్ళు తమ సమస్యల పరిష్కారాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలోనే వెదుక్కుం టారు తప్ప బయటకు పోరు' అంటూ వ్రాసింది. ఆ సంపాదకుడు ఇలా వ్రాయడానికి కారణం పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం లేకపోవడమే. ఏవైనా గొడవలొస్తే మిలటరీని ఆశ్రయించే ప్రయత్నం చేస్తారు. మన వాళ్ళకింకా ఆలోచన రాలేదని మెచ్చుకుంటూ వ్రాశాడు. కాని మన పాలకులు వేరే కారణాల వలన వెతుక్కునే అవకాశం కొంత పరిశీలించాల్సి ఉంది.

ఈ మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సింగపూర్, మలేషియా, తైవాన్, సౌత్‌కొరియా దేశాలపేర్లు వల్లిస్తూ, ఆయా దేశాలపట్ల ఆకర్షణ పెంచుకుంటున్నారు. దీనికి ఆయనకు రెండు కారణాలు ఉన్నాయి. బయటకు చెప్పే మొదటి కారణం ఆయాదేశాల ఆర్థిక పరిస్థితులలో వార్షికవృద్ధి రేటు. మన దేశపు వృద్ధిరేటు 4% లేక 5% ఉంటే ఆయాదేశాల్లో పదినుండి పదమూడు శాతం ఉంది. ఆయాదేశాలు ఈ ప్రగతిని ఎలా సాధించాయో అధ్యయనం చేయడానికి ఆదేశాలు పర్యటన చేస్తున్నట్లు చెపుతున్నారు. ఇక ఆయన దాచి పెట్టుకున్నరెండో విషయం చాలా ప్రమాద కరమైనది. ఇప్పుడు చెబుతున్న ఏ ఒక్కదేశంలోనూ కనీసమయిన పౌరహక్కులుగాని, ప్రజాస్వామ్యంగాని లేదు. మనదేశంలో ఉన్న ఎన్నికలు, కోర్టుల వలన ఆటంకాలు, పౌరహక్కుల విషయాలు ఆయాదేశాల్లో లేవు. ఇది గొప్ప ఆకర్షణ. ఆయాదేశాల్లో సంఘాలు పెట్టుకొనే హక్కు, సమ్మెచేసే హక్కులు లేవు లే ఆఫ్ అంటే ఇంటికి పోవడమే. భారతదేశంలో అయితే సగం జీతం యివ్వాలి. నిజంగా అమలు జరుగుతుందా అనేది వేరే విషయం.

ఇప్పుడు సరళీకరణ అనే మాట ఎక్కువగా వినబడుతోంది ఈ సరళీకరణ ఎవరికి? కఠినీకరణ ఎవరికి అనేవి ప్రశ్నలు. సరళీకరణ పేరుతో పరిశ్రమల్లో తమ నియమాలు విధించుకొనే స్వేచ్ఛ ఆయాదేశాల్లో పెట్టుబడిదారులకు ఉంది. మన దేశంలో అంత స్వేచ్ఛలేదు. అందుకే ప్రపంచ బ్యాంకు, ఐ.యం.యఫ్‌కు, మన ముఖ్యమంత్రికి పెద్ద అసంతృప్తిగా ఉంది 1990-91నుండి ప్రకటితంగాగాని, అప్రకటితంగాగాని పాలకులు ఎంత సరళీకరణ పద్ధతులు ప్రకటిస్తున్నా, పెట్టుబడి దారులు పెట్టిన అన్నిషరతులు అంగీకరిస్తున్నామని చెప్పినా విదేశీయులు పెద్దఎత్తున రావడంలేదు. వాళ్ళు తైవాన్, కొరియా, చైనా వంటి దేశాలకు పోతున్నారు. ప్రతిసారీ బడ్జెట్ ప్రసంగంలో మన్మోహన్‌సింగ్, చిదంబరం వంటి ఆర్థికమంత్రులు విదేశీ పెట్టుబడులు రానందుకు అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. విదేశీయులు రాకపోతే యీ దేశంలో సంపదలేలేవా? అంటే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎకానమీ యిండియాలో 13వ స్థానం నుండి గత 15ఏళ్ళలో చాలాపైకి పోయింది దేశంలో కోటీశ్వరులున్నారు. ఈ సంపదలలో కొంతభాగం ప్రభుత్వం తన చేతులలోనికి తీసుకొని దానిని పెట్టుబడిగా ఉపయోగించడానికి ఎందుకు ప్రయత్నం చేయడంలేదు. ప్రజల, దేశ ఆర్థికాభివృద్ధికి యీ సంపదల్ని ఎందుకు వినియోగించడంలేదు. అన్నప్రశ్నలకు పాలకుల నుండి జవాబు రావడం లేదు. దేశంలో పెట్టుబడిలేదని ప్రభుత్వాలు అబద్ధాలు చెపుతున్నాయి. మద్యనిషేధం, కిలో రెండురూపాయిల పథకం వలన రెవెన్యూ లేక పోతోందని ప్రభుత్వం చెప్పే మాటలు మనలో చాలామంది విశ్వసిస్తున్నాం. నిజానికి ఈ రోజు ఆంధ్రదేశంలో 200, 300కోట్ల రూపాయల ఆస్థిపరులు కొన్ని వందల వేల మంది ఉన్నారు. వీరి నుండి ఇన్‌కమ్‌టాక్స్, వెల్త్‌టాక్స్‌ల ద్వారా చట్టప్రకారం రెవెన్యూ సేకరించి ప్రజలకోసం ఖర్చుపెట్టవచ్చు.

విదేశీ పెట్టుబడిదారులు మన దేశపు కార్మికచట్టాలు మరీ కఠినంగా ఉన్న కారణం చేత ఈ దేశానికి రామని అంటున్నారు. కార్మికులకు హక్కులు ఎక్కువ. ట్రేడ్ యూనియన్లు పెట్టుకునే హక్కు భారతదేశంలో ఉంది. పరిశ్రమలు మూత పెట్టాలంటే ప్రభుత్వ అనుమతి పొందాలి. ఈ చట్టాలు మార్చకపోతే రాలేమంటున్నారు. దీన్ని బట్టి అర్థమయేదేమంటే దేశంలో ప్రజాస్వామ్యానికి, పౌరహక్కులకు, కార్మికహక్కులకు పెద్దవిఘాతం కలగనిదే ఆంధ్రప్రదేశ్ ఒక ఏసియన్ టైగర్ కాలేదు మన దేశమే ఆర్థిక అస్వతంత్ర దేశం. అయినా ప్రపంచబ్యాంకు వంటి అంతర్జాతీయ పెట్టుబడి దారుల నుండి మన ప్రభుత్వంపై ఒత్తిడి ఉంది. యజమానికి హైర్ అండ్ ఫైర్ స్వేచ్ఛ ఉండాలంటున్నారు. ఈ దశలో మనం పౌరులుగా, ఉపాధ్యాయులుగా మీరు ఎంచుకోవలసింది ఏమంటే ఆర్థిక వృద్ధి పెరుగుదల రేటు కోసం పౌరహక్కుల్ని వదులుకోరాదు. గ్రోత్ పేరుతో కోటీశ్వరులు యింకా కోటీశ్వరులు కావడమేగాని సామాన్యులకు తిండి లేకుండా పోతుందన్న సత్యాన్ని ప్రభుత్వాలు చెప్పడంలేదు. స్పష్టంగా అడిగితే మనం జవాబు చెబుతాం. ప్రజలకు పౌరహక్కులు, ప్రజాస్వామ్యం ఉండితీరాలని చెప్తాం.

ప్రపంచబ్యాంకు నాలుగేళ్ళ క్రిందట ఒక డాక్యుమెంటు ప్రచురించింది. అందులో "ఉద్యోగ భద్రత ప్రమాదకరమైన అభివృద్ధి" అని వ్రాసింది. ఈ పాలసీ వదిలిపెడితే భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది అని ప్రపంచబ్యాంకు సలహా. వీటిపై ప్రభుత్వం నోరుమెదపడంలేదు. ప్రజలకు నిజాలు చెప్పడంలేదు. కాని వాళ్ళ మనసుల్లో ఇది పెట్టుకొనే అప్పుడప్పుడు ఆచరణలో కొన్నింటిని ప్రవేశపెడుతున్నారు కాంట్రాక్ట్ పద్ధతిమీద ఉద్యోగాలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటన ఇందులో భాగమే. ఈ విధంగా కార్మిక వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరేక పాలసీలు అమలు పరచాలను కుంటున్నారు.

ఒక విద్యుత్ పరిశ్రమ పెట్టాలంటే

ప్రయివేటు వ్యాపారస్థునికి వారికి భూమియిచ్చి, నీళ్ళు సరఫరాచేసి, అతను ఉత్పత్తి చేసిన కరెంటు తిరిగి కొనుగోలు చేస్తామని హామీ యిచ్చి ప్రోత్సహిస్తారు. ఈ రకమయిన వ్యాపారంలో నష్టం ఎందుకు వస్తుంది. ప్రయివేటు పెట్టుబడిదారుడు సమర్థవంతంగా పనిచేస్తాడన్నప్పుడు నష్టాలు రావుకదా! మరి ప్రభుత్వం ఈ సౌకర్యాలు అతనికి ఎందుకు కల్పిస్తున్నట్లు? అయినా వారికివచ్చిన నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.

ఇన్ని సదుపాయాలు పారిశ్రామికులకు కల్పించిన ప్రభుత్వం రెవెన్యూ లోటుపేరుతో ఉన్న అతికొద్ది సబ్సిడీలు రద్దుచేయడానికి పూనుకొంటున్నది. సబ్సిడీలు రద్దయితే రైతులు తిరుగుబాటు చేయవలసి వస్తుంది. అప్పుడు ప్రభుత్వం ఏం చేస్తుంది. అదే మన ముఖ్యమంత్రి ఆకర్షణ. ఇవన్నీ వచ్చినప్పుడు పోలీసు, సైన్యం, పారామిలటరీ దించేసి 144 సెక్షన్ పెట్టి, కర్ఫ్యూ పెట్టి అణచివెయ్యగలగాలి. ఇలా చెయ్యడానికి ఈ దేశంలో ఉన్న అతిచిన్న ఆటంకం, పరిమితులు ఉండడమే ప్రభుత్వాలను బాధించే విషయాలు. ఇలా కాకుండా ఏషియన్ టైగర్స్ దేశాల్లోవలె అడ్డులేకుండా ఉంటే ఎంత బాగుండును అనేది వారి ఆకాంక్ష.

దేశంలో దారిద్ర్యాన్ని, దరిద్రరేఖ దిగువనున్నవారి లెక్కలు బాగా సేకరిస్తారు. కాని ఎప్పుడైనా సంపదల అంచనాలు ప్రకటించబడ్డాయా. గడచిన నలభైఏళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యక్తులకు పెరిగిన ఆస్తులను మదింపుచేసి చట్టప్రకారం టాక్సులు వసూలు చేయడం చేస్తున్నారా? లేదు. ఇదే ధనవంతులకిస్తున్న పెద్ద సబ్సిడీ. కిలో రెండు రూపాయలకి బియ్యం పథకం సబ్సిడీనే పేద రైతాంగానికి యిచ్చిన కరెంటు సబ్సిడీనే ప్రజలకు చెపుతారు. పన్నులు ఎగవేస్తే ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించడం పెద్ద సబ్సిడీ యివ్వడమే కదా. ఇవన్నీ యీ రోజు పౌరహక్కులుగా ఉన్న సమస్యలు.

భారతరాజ్యాంగంలో ముఖ్యమయిన విలువల్లో దళితులను, పేదవాళ్ళను, దిక్కులేని వాళ్ళను ప్రభుత్వం ఆదుకోవడం ప్రధానమయినది. ఇవన్నీ అమలు చెయ్యాలని సామాజిక, ఆర్థిక న్యాయాలకోసం ఎన్నో పోరాటాలు జరిగాయి. వీటి ఫలితంగా ప్రభుత్వాలు అరకొరగా ప్రజాసంక్షేమానికి కొంతైనా కాదలవలసి వచ్చింది. ప్రజాస్వామ్యం ఉందనే అభిప్రాయం కల్పించింది. ఈ అభివృద్ధికోసమే విదేశాల్లో అప్పులు చేస్తున్నామని చెపుతున్నారు. ఈ అప్పులకు షరతుగా ప్రయివేటైజేషన్ చెయ్యమని ఒత్తిడి చేస్తున్నారు. దీనికి ఒకటే సమాధానం ఉంది. భారతదేశంలో సంపదకు కరువు లేదు. సాంకేతిక నైపుణ్యానికి కరువులేదు. సంపదలను స్వాధీనం చేసుకుని ఆ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటే మనకు కావలసినంత ఉత్పత్తిని భారతదేశంలోనే చేసుకోవచ్చు. దాని కోసం ప్రజాసంక్షేమాన్ని, పౌరహక్కులను, దెబ్బతీయాల్సిన అవసరం లేదు. ప్రపంచబ్యాంకు ఒత్తిడులకు లొంగి సంక్షేమ రంగాలకు ఖర్చునంతా ఎత్తివేస్తే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. అది తిరుగుబాట్లు, నిరసన, ఆందోళన వంటి ఏదైనా రూపం తీసుకోవచ్చు. అలా వచ్చినప్పుడు, అవి రావడానికి కారణమయిన కొంచెంగా ఉన్న ప్రజాస్వామ్యాన్ని సంపూర్ణంగా మట్టుబెట్టాలని ఆలోచనలు చేస్తుంటారు పాలకులు. కోర్టులు ప్రజాప్రతినిధుల తప్పులు, అవినీతిపట్ల చొరవ చూపించి తీర్పులివ్వడాన్ని ప్రశ్నిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను అరికట్టాలని చూస్తున్నారు. మేధావులు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండి కూడా పౌరహక్కులు గూర్చి మాట్లాడవచ్చా అంటూ దాడిచేస్తున్నారు.

విద్యాబోధన ఒక నిరంతర వ్యాఖ్యానం కాబట్టి ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని, ఇది అర్థం చేసుకొని, ఎదుర్కొనడానికి, ఇది వాస్తవంకాదు అని చెప్పడానికి ప్రభుత్వం చెప్తున్న అబద్దాలను దినపత్రికల సహాయంతో గుర్తించడానికి కావలసిన జ్ఞానం మీరు మీ పిల్లలకు ఇవ్వడం చాలా అవసరం. మిగిలిన ఎన్ని లోపాలు విద్యారంగంలో ఉన్నా ఇప్పటి విద్యావ్యవస్థ సంఖ్యరీత్యా చాలమందిని విద్యారంగంలోనికి ఆహ్వానించడం జరిగింది. ఈ ప్రభుత్వ నూతన విధానాల వలన ముఖ్యంగా ఎక్కువగా జరగబోయే నష్టం యీ క్రొత్త తరాలకే. ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామ్య హక్కులకు, పౌరహక్కులకు, పత్రికా స్వేచ్ఛకు, న్యాయవ్యవస్థకు ఉండే కొన్ని అధికారాలకు, స్వతంత్ర ప్రతిపత్తికి ఏ నష్టం వచ్చినా అదంతా యీ క్రొత్త తరాల భవిష్యత్తుకే దెబ్బ. ఈ తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రజాస్వామ్య విధ్వంసానికి సంబంధించిన వాస్తవాలను మీ వ్యాఖ్యానాలలో భాగంచేసి వాళ్ళను విద్యావంతులు చేస్తారని ఆశిస్తున్నాను.

❄

*With best compliments from*

☏ 422208

# SUPER STAR

## ENTER PRISES

**11-41-34, KANDULAVARI STREET**
**VIJAYAWADA-520 001**

*Manufacturers of:*

Domestic & House Wiring Cables, Power & Control Cables, Industrial & Agricultural Wiring Cables, P.V.C. Insulated Single & Multicore Cables, submersible Cables, Jelly Filled Telephone Cables, Dish Antenna & T.V. Cables.